మోండా మార్కెట్‌లో దళితుడిపై దాడికి నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ: మోండా మార్కెట్‌లో దళిత యువకుడి పై మార్వాడీ వ్యాపారుల దాడిని ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి తీవ్రంగా ఖండించారు. సోమవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట దళిత యువకుడు సాయికుమార్‌పై దాడికి వ్యతిరేకంగా ప్లకార్డులతో నిరసన చేపట్టారు. దాడి చేసిన వ్యక్తులను అరెస్ట్ చేసి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా ఈ నెల 22న జరిగే బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో దరువు రమేశ్, రాజేందర్, రమేశ్, శివాజీ, చరణ్, అరుణ్, జలంధర్, రాజు, కుమార్, శ్రీనివాస్, రాము, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పాత కల్యాణ మండపం తొలగింపు పనులు ప్రారంభం

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద పాత కల్యాణ మండపం తొలగింపు పనులు సోమవారం ప్రత్యేక పూజల అనంతరం ప్రారంభించారు. సుమారు 450 గజాల విస్తీర్ణంలో ఉన్న స్థలంలో ఉన్న పాత భవనం తొలగించి స్థలాన్ని కేంద్ర టూరిజం శాఖకు అప్పగించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి మహేందర్‌గౌడ్ తెలిపారు. సదరు స్థలంలో ప్రసాద్ పథకం కింద కొత్త భవనం నిర్మిస్తారని, ఇందు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.4.21 కోట్ల నిధులు ఈ సంవత్సరం మార్చిలో విడుదల చేసిందని చెప్పారు. గ్రౌండ్ ప్లస్ 5 అందస్తుల భవనంలో కల్యాణ మండపంతో పాటు అన్నదానం చేసేందుకు వీలుగా నిర్మాణాలు ఉంటాయన్నారు. పూజల్లో ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

జప్తు చేసిన వాహనాలకు నేడు వేలం పాట

అమీర్‌పేట: అమీర్‌పేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎన్‌డీపీఎస్ కేసుల్లో జప్తు చేసిన వాహనాలకు మంగళవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలచిన వ్యక్తులు రూ.15000 వేల ధరావతు చెల్లించాలని సూచించారు. వేలం ద్వారా వాహనాలు సొంతం చేసుకున్నాక మిగిలిన మొత్తాన్ని 18 శాతం జీఎస్టీతో కలిపి చెల్లించి వాహనం తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. వేలంలో పాల్గొని వాహనం తక్కించుకోని వారికి ముందుగా చెల్లించిన ధరావతు తిరిగి చెల్లిస్తామని అమీర్‌పేట ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



సికింద్రాబాద్: రైల్వేస్టేషన్‌లో సోమవారం గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణసింగ్ వివరాల మేరకు రైల్వే స్టేషన్‌లోని 2/3 ప్లాట్‌ఫామ్ మధ్యలో సుమారు 70 ఏళ్ల వ్యక్తి అపస్మారక స్థితిలో పడిఉన్నట్టు సమాచారం అందింది. ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు అనారోగ్య సమస్యలతో సదరు వ్యక్తి మృతి చెందినట్టు గుర్తించారు. మృతుడి ఒంటిపై వంకాయ కలర్ షర్టు, గ్రీన్ కలర్ లుంగీ ఉన్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు పోలీసులకు లభించలేదు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. వివరాల కోసం 87125 13719, 87126 58581 మొబైల్ నెంబర్ల ద్వారా సంప్రదించాలని పోలీసులు కోరారు.

కొత్త హాస్టల్‌కు మూసినది పేరుపెట్టండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో ఈ నెల 21న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్న కొత్త హాస్టల్ భవనానికి మూసినది పేరు పెట్టాలని పీహెచ్‌డీ విద్యార్థి నాయకుడు వలిగొండ నరసింహ అధికారులను కోరారు. సోమవారం ఆయన ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట మాట్లాడుతూ మూసినది సుందరీకరణకు సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న కృషికి గుర్తింపుగా ఓయూ క్యాంపస్‌లోని హాస్టల్ భవనానికి మూసినది పేరుపెడితే చరిత్రలో స్థిరస్థాయిగా నిలిచిపోతారని వీసీ ప్రొ.కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. క్యాంపస్ హాస్టల్స్‌కు నదుల పేర్లు పెట్టడం ఆనవాయితీ అని ప్రస్తుతం ఓయూలో మూసినది మినహా ఇతర నదుల పేర్లతో హాస్టల్స్ కొనసాగుతున్నాయని వలిగొండ నరసింహ ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఓయూలో ఘనంగా సర్వాయి పాపన్నగౌడ్ జయంతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతి వేడుకలను విద్యార్థులు ఘనంగా జరుపుకొన్నారు. సోమవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట బీసీ విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పలువురు హాజరై పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహేష్, శ్రీకాంత్, రాజేష్, సంతోష్, మల్లేష్, సాయినాథ్, రమ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల నుంచి తప్పించుకున్న దొంగ

గాంధీఆస్పత్రి: పోలీసుల కళ్లుకప్పి దొంగ తప్పించుకున్న ఘటన సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో జరిగింది. చిలకలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిక్‌విలేజ్‌కు చెందిన సోహైల్‌ఖాన్ (19)ను రాబరీ కేసులో బేగంపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించే ముందు వైద్యపరీక్షల నిమిత్తం ఈనెల 17న గాంధీఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యపరీక్షలు ముగిసేవరకు పోలీసుల కస్టడీలో ఉన్న సోహైల్‌ఖాన్ మూత్రం వస్తుందని చెప్పడంతో బాత్‌రూమ్‌కు వెళ్లిన సోహైల్‌ఖాన్ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి చూడగా లోపల కనిపించలేదు. బాత్‌రూమ్ కిటికీ నుంచి దూకి పారిపోయినట్లు గ్రహించి పలు ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకుండాపోయింది. బేగంపేట పోలీసుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపారు.

ఓయూలో పీహెచ్‌డీ డిగ్రీల పంట

- గ్రామీణ విద్యార్థులకు అందుబాటులో పరిశోధన విద్య
- 108 ఏళ్లలో 50 గౌరవ డాక్టరేట్లు, 50 వేల పైగా డాక్టరేట్లు
- నేడు 84వ స్నాతకోత్సవం, ముఖ్యఅతిథిగా ఇస్రో చైర్మన్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఏటా పీహెచ్‌డీ డిగ్రీల పంట పండుతోంది. తొలి రోజుల్లో పట్టణ విద్యార్థులకు మాత్రమే పరిమితమైన పీహెచ్‌డీ పరిశోధన విద్య నేడు గ్రామీణ విద్యార్థులకు అందుబాటులోకి వచ్చింది. గ్రామాల్లో 30 ఏళ్ల క్రితం బీఏ డిగ్రీ విద్యార్థులు అరుదుగా కనిపించేవారు. కానీ నేడు ప్రతీ మూడు గ్రామాలకు కలిపి ఒక పీహెచ్‌డీ డాక్టరేట్లు పేద, మధ్యతరగతి కుటుంబాల్లోను కనిపించడం విశేషం. 108 ఏళ్ల ఓయూలో సుమారు 50 వేలకు పైగా పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాలను విద్యార్థులకు అందజేశారు. వివిధ రంగాల్లో విశేష సేవలందించిన జాతీయ, అంతర్జాతీయ స్థాయి 49 మంది ప్రముఖులు గౌరవ డాక్టరేట్లను అందుకోగా నేడు (19న) జరిగే స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ డా.నారాయణన్‌కు 50వ గౌరవ డాక్టరేట్‌ను అందజేయనున్నారు. ఓయూలో పీహెచ్‌డీ డిగ్రీలు అందుకున్న వారిలో అధికంగా యూనివర్సిటీల అధ్యాపకులుగా, లెక్చరర్స్‌గా స్థిరపడ్డారు.

1938లో పీహెచ్‌డీ కోర్సు ప్రారంభం

నిజాం నవాబు పాలనలో 1917లో డిగ్రీ కోర్సులతో స్థాపించిన ఓయూలో 1925లో పీజీ కోర్సులు, 1938లో పీహెచ్‌డీ పరిశోధక విద్యను ప్రారంభించారు. వర్సిటీ ప్రారంభమైన తొలిరోజుల్లో పట్టణాలకు చెందిన వ్యాపారులు, ఇతర సంపన్న కుటుంబాల విద్యార్థులు అధిక సంఖ్యలో పరిశోధనలు చేశారు. డిగ్రీ పూర్తికాగానే ప్రభుత్వ ఉద్యోగాలు లభించినందున గ్రామీణ విద్యార్థులు పీజీ, పీహెచ్‌డీ విద్యపై ఆసక్తి చూపలేదు. కాలక్రమేణ ఉన్నత విద్య గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడంతో పీహెచ్‌డీ పరిశోధన విద్యపై పేద విద్యార్థుల్లో ఆసక్తి పెరిగింది. ఏటా స్నాతకోత్సవం నిర్వహించి పీహెచ్‌డీ పూర్తి చేసిన విద్యార్థులకు డాక్టరేట్లను అంజేస్తున్నారు.

జాతీయ ఫెలోషిప్‌లతో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు

జాతీయ ఫెలోషిప్‌లతో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పీహెచ్‌డీ విద్యను పూర్తి చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో పీజీతో చదువులు మానేసిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రాజీవ్ గాంధీ, ఇతర ఫెలోషిప్‌లతో పరిశోధనలు పూర్తి చేసి డాక్టరేట్ డిగ్రీలను సాధించారు.

సీఎం రీసెర్చ్ ఫెలోషిప్ పైన ఆశలు

జాతీయ ఫెలోషిప్‌లను ఐదేళ్ల నుంచి తగ్గించడంతో పీహెచ్‌డీ విద్యార్థులు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంపాదించే వయస్సుల్లో పీహెచ్‌డీ చదవాలంటే ఆర్థిక ఇబ్బందులతో అనేక మంది విద్యార్థులు మధ్యలోనే మానేస్తున్నారు. విద్యార్థుల సమస్యను అర్థం చేసుకున్న మాజీ వీసీ ప్రొ.రవీందర్ సీఎం రీసెర్చ్ ఫెలోషిప్‌ను ప్రవేశపెట్టాలని నాటి సీఎం కేసీఆర్‌ను విజ్ఞప్తి చేశారు. వివిధ కారణాల వలన సీఎం రీసెర్చ్ ఫెలోషిప్ అమలు కాలేదు. ఈ నెల 21న ఓయూ క్యాంపస్‌లో జరిగే సదస్సులో సీఎం రీసెర్చ్ ఫెలోషిప్‌ల అమలుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు 84వ స్నాతకోత్సవం

ఓయూ క్యాంపస్ ఠాగూర్ ఆడిటోరియంలో నేడు (19న) 84వ స్నాతకోత్సవం జరగనుంది. గతంలో ఎన్నడు లేని విధంగా నేడు జరిగే స్నాతకోత్సవంలో వివిధ సబ్జెక్టుల్లో పరిశోధనలు పూర్తి చేసిన 1261 మంది పీహెచ్‌డీ స్కాలర్స్‌కు డాక్టరేట్ డిగ్రీ పట్టాలను ఇవ్వనున్నారు. వివిధ పీజీ కోర్సుల్లో అత్యధిక మార్కులు సాధించిన 121 మందికి బంగారు పతకాలు, ఇస్రో చైర్మన్ డా.నారాయణన్‌కు 50వ గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేయనున్నట్లు వీసీ ప్రొ.కుమార్ పేర్కొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకరిస్తాం

– ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



సనత్‌నగర్: ఆలయాల అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌లోని లోదా అపార్ట్‌మెంట్ వెనుక గల ఇండస్ట్రీయల్ ఏరియాలో పబ్బా ఆంజనేయస్వామి, నల్లపోచమ్మ ఆలయాల పునర్నిర్మాణ పూజల్లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు. అమ్మవారిని, స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ నమూనాలను ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు వివరించారు. ఎమ్మెల్యే వెంట సనత్‌నగర్ బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు భూపాల్‌రెడ్డి, శివశంకర్, యాదగిరి, రాజు, పటేల్, నాయకులు సురేష్‌గౌడ్, ఖలీల్, రాజేష్‌ముదిరాజ్, పీయూష్ గుప్తా, ఫాజిల్, జమీర్, సురేందర్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలు తక్షణమే నిర్వహించాలి

లాలాపేట: స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలని తెలంగాణ ప్రజా జీవన రైతు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చుండి శోభన్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం శాంతినగర్‌లో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామ సర్పంచ్‌లు లేక రెండెళ్ల నుంచి పాలన పూర్తిగా కుంటుపడిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ల పేరుతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వాహణ కాలయాపన చేయరాదన్నారు. చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని సూచించారు.

పాఠశాల కొనసాగేలా చర్యలు తీసుకుంటాం



సీఈవో మధుకర్‌నాయక్‌ను కలిసిన క్రిషాంక్, మడ్‌ఫోర్ట్ అంబేడ్కర్ హట్స్ బస్తీవాసులు

రసూల్‌పురా: అంగన్‌వాడీ కేంద్రం భవనంలో కేవలం అంగన్‌వాడీ పాఠశాల కొనసాగేలా చర్యలు తీసుకుంటామని కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్ హామీ ఇచ్చారు. సోమవారం రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ మన్నె క్రిషాంక్ ఆధ్వర్యంలో మడ్‌ఫోర్ట్ అంబేడ్కర్ హట్స్‌కు చెందిన పలువురు బోర్డు కార్యాలయంలో సీఈవో మధుకర్‌నాయక్‌ను కలిశారు. ఈ సందర్భంగా క్రిషాంక్ ఓ రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తి ఆధ్వర్యంలో మడ్‌ఫోర్ట్ అంబేడ్కర్ హట్స్‌కు చెందిన అంగన్‌వాడీ కేంద్రం పాఠశాలకు కాకుండా ఇతర కార్యక్రమాలకు వాడుకుంటున్నాడన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు అంగన్‌వాడీ పాఠశాల కేటాయించినప్పటికీ సదరు రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు తాళం వేస్తున్నాడని సీఈవోకు ఫిర్యాదు చేసి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన సీఈవో రాజకీయ, అనాధికారిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవడంతో పాటు కేవలం అంగన్‌వాడీ పాఠశాల కొనసాగేలా చర్యలు తీసుకుంటామని హామీచ్చారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

కార్పొరేటర్ సునీతకు అభినందన



సికింద్రాబాద్: నియోజకవర్గం మెట్టుగూడ డివిజన్ కార్పొరేటర్ రాసూరి సునీతకు ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ డాక్టరేట్ పురస్కారాన్ని అందించింది. సామాజిక సేవా రంగంలో సేవలు అందించినందుకు ఆమె డాక్టరేట్ పురస్కారాన్ని అందుకున్నారు. డాక్టరేట్ అందుకున్న మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీతను సికింద్రాబాద్ శాసనసభ్యుడు టీ.పద్మారావుగౌడ్ సోమవారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక సేవా రంగాల్లో సేవలందించే ప్రజాప్రతినిధులు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని అన్నారు.

శిథిల భవనాన్ని కూల్చివేయండి

సనత్‌నగర్: శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్న భవనాన్ని కూల్చివేయాలని భవన యజమానులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు పలు విభాగాల అధికారులను కలసి ఇక్కడి భవన శిథిలస్థితిని వివరించారు. బేగంపేట శ్యాంలాల్‌బిల్డింగ్స్‌లో దశాబ్దాల కాలం నాటి ఓ భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం పడుతున్న వర్షాలతో ఏ ప్రమాదం సంభవించక ముందే తక్షణమే దానిని కూల్చివేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్, బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్, హైడ్రా కమిషనర్, బేగంపేట పోలీసులకు ముగ్గురు భవన యజమానులు ఫిర్యాదు చేశారు.

ఓయూలో బీఆర్‌ఎస్‌వీ విద్యార్థి నేతల ఆందోళన



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో బీఆర్‌ఎస్‌వీ విద్యార్థి నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట 21న ఓయూకు సీఎం రేవంత్‌రెడ్డి రాకను వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టగా, పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేశారు. గత ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, పెండింగ్ స్కాలర్‌షిప్‌లను చెల్లించకుండా, వర్సిటీల అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయకుండా ఓయూకు సీఎం ఏ ముఖం పెట్టుకొని వస్తారని బీఆర్‌ఎస్‌వీ నాయకులు చటారి దశరథ్, నాగారం ప్రశాంత్ పేర్కొన్నారు. ఓయూకు సీఎం రాకను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకులు జంగయ్య, శ్రీను నాయక్, శ్రీకాంత్ ముదిరాజ్, నాగేందర్ రావు, అవినాష్, సాయిగౌడ్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద రోగుల మొర ఆలకించరా

నేడు గాంధీని సందర్శించనున్న వైద్యమంత్రి రాజనర్సింహ

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిని గాడిలో పెట్టేందుకు వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తానే స్వయంగా రంగంలోకి దిగనున్నారు. వైద్యుల కొరత, వైద్యసేవల్లో జాప్యం, అధికారుల నిర్లక్ష్యంతో గాంధీ ఆస్పత్రి తరచూ వివాదాలతో నిత్యం వార్తల్లో నిలుస్తోంది. ఈ నేపథ్యంలో వైద్యమంత్రి దామోదర రాజనర్సింహ ఆస్పత్రి పాలనయంత్రాంగంతో నేరుగా సమావేశం కావడం నిరుపేద రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలు సమస్యలకు తక్షణ పరిష్కారం దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వైద్యమంత్రి రాజనర్సింహ గాంధీ అధికారులతో కీలక అంశాలపై చర్చించనున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో గాంధీలో నెలకొన్న సమస్యలపై సాక్షి ఫోకస్...

- వైద్యసేవలు, మల, మూత్ర రక్తనమూనాలు, పలు రకాల వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న తీరుతెన్నులపై సమీక్ష నిర్వహించి మరింత పారదర్శకంగా, త్వరగా నివేదికలు అందించేలా చేపట్టాల్సిన చర్యలపై చర్చించాలి.
- గాంధీ రేడియాలజీ విభాగంలో మూలనపడిన సీటీస్కాన్, ఎక్స్‌రే యంత్రాలకు తక్షణం మరమ్మతులు చేయించి నిరుపేద రోగులకు అందుబాటులోకి తేవాలి. రేడియాలజీ విభాగంలో వైద్యులు, టెక్నీషియన్ల కొరతను నివారించాలి.
- అత్యాధునిక జనరేటర్లు ఏర్పాటు చేయాలి. విద్యుత్ అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేపట్టాలి. నిలిచిపోయిన విద్యుత్ వ్యవస్థ ప్రక్షాళన పనులు పునరుద్ధరించాలి.
- నత్తనడకతో కొనసాగుతున్న డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళన పనులు త్వరగా పూర్తి చేయాలి. భవన లీకేజీలను నివారించాలి. ఇటీవల ప్రారంభించిన సంతాన సాఫల్య కేంద్రంలో వసతులు, సౌకర్యాలు కల్పించాలి.
- ప్రధాన భవనం ఎనిమిదవ అంతస్తులో నిర్మిస్తున్న అవయవ మార్పిడి శస్త్రచికిత్సల అధునాతన ఆపరేషన్ థియేటర్ల సముదాయం నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలి.
- వైద్యులు, టెక్నీషియన్లు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది కొరత సమస్యను పరిష్కరించాలి.
- కాంట్రాక్టు కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి. ప్రతీ నెల వేతనాలు అందించాలి, కార్మికుల ఖాతాల్లో పీఎఫ్ జమచేయాలి. ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి.
- ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేయాలి. ఆరోగ్యశ్రీ విభాగంలో రెండు దశాబ్దాలుగా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలి.
- పాడై మూలన పడిన వైద్యయంత్రాలకు మరమ్మతులు చేయించాలి. యంత్రాల నిర్వహణ బాధ్యతలను ఆయా సంస్థలకు అప్పగించాలి.

స్వయం సంవృద్ధి సాధించడానికి దోహదపడుతుంది



లాలాపేట: రైల్వే ఉద్యోగులు స్వయం సంవృద్ధి సాధించడానికి రైల్వే ఉద్యోగుల సహకార పరపతి సంఘం ఎంతగానో దోహదపడుతుందని ఆ సంఘం అధ్యక్షుడు డా. సీహెచ్. స్వామి అన్నారు. సికింద్రాబాద్ దక్షిణ మధ్య రైల్వే ఉద్యోగుల సహకార పరపతి పరిమిత సంఘం 86వ జనరల్ బాడీ వార్షిక సమావేశం సోమవారం తార్నాకలోని రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు డా. సీహెచ్. స్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రైల్వే చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్ధార్థ్‌కాటే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో వెయ్యికోట్ల టర్నోవర్‌కు రైల్వే ఉద్యోగుల సహకార పరపతి సంఘం చేరుకోవా లని ఆకాంక్షించారు. అనంతరం సంఘం సభ్యులందరికీ వార్షిక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు ఆర్. రామ్మోహన్, డైరెక్టర్లు కృష్ణయ్య, రమేశ్, రాజేందర్, శ్రీనివాసరావు, కుమార్, మహేశ్‌కుమార్, నాగ మురళికృష్ణ, యాదగిరిస్వామి, శ్రీనివాస్‌యాదవ్, అంజయ్య, విఠల్, కపిల్, కంచన్‌కుమార్, శ్రీధర్, ప్రభాకర్‌బాబు, మల్లేశ్వర్‌రావు, లాలియానాయక్, రమేశ్, సుధాకర్, కుర్మయ్య, రాఘవేందర్, దాదాపు 210 మంది డెలిగేట్స్ పాల్గొన్నారు.

కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే అభినందనలు

సనత్‌నగర్: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని న్యూక్లబ్ నూతన కమిటీ సభ్యులకు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవలే నూతన కమిటీ ఎన్నిక జరగగా, సోమవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నూతన కమిటీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రశాంత్, కోశాధికారి తరుణ్, సభ్యులు రాజశేఖర్, సుజయ్, విజయ్‌కుమార్, సాయికృష్ణ తదితరులు ఉన్నారు.

మహాసభను జయప్రదం చేయండి



బౌద్ధనగర్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఈ నెల 31న నిర్వహించనున్న దివ్యాంగులు, చేయూత పెన్షన్ దారుల మహాసభను జయప్రదం చేయాలని ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ కోరారు. ఈ సందర్భంగా సోమవారం సోమవారం బౌద్ధనగర్‌లో ఆయన మాట్లాడుతూ ఈ నెల ఓటు వేయండి వచ్చే నెల పెరిగే పెన్షన్ తీసుకొండని మాట్లాడిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టి 20 నెలలు దాటినా ఒక్క రూపాయి కూడా పెంచకుండా ఘోరమైన మోసం చేశాడని ఆరోపించారు. దివ్యాంగుల పెన్షన్ రూ. 6 వేలకు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అన్ని రకాల చేయూత పెన్షన్లు రూ. 4 వేలకు పెంచాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈ నెల 31న సికింద్రాబాద్ నియోజకవర్గం సీతాఫల్ మండి డివిజన్‌లో దివ్యాంగుల, చేయూత పెన్షన్ దారుల మహాసభను నిర్వహిస్తున్నామని, దీనికి ముఖ్య అతిథిగా పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో ఉన్న అన్ని రకాల చేయూత పెన్షన్ దారులు ఈ మహాసభకు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చేయూత పెన్షన్ దారులు, ఎంఎస్పీ డివిజన్ అధ్యక్షులు చాలేగూడెం దేవేందర్, సరోజన పద్మ, మైసమ్మ, బబ్బి, ఈరల్లి రాజు, రఘు మాదిగ, పాక హరి మాదిగ, ఎడ్ల రుద్రి పాల్గొన్నారు.

మాల మహానాడు సికింద్రాబాద్ నూతన కార్యవర్గం



నియామకపత్రాన్ని అందజేస్తున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

అడ్డగుట్ట: డివిజన్‌లోని ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లో సోమవారం మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య నేతృత్వంలో సికింద్రాబాద్ నియోజకవర్గం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాల మహానాడు సికింద్రాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా నేతల రమేశ్, మహిళా అధ్యక్షురాలిగా రమాదేవి, ఉపాధ్యక్షులుగా నర్సింగరావు, జనరల్ సెక్రెటరీగా బూడిద శ్రీకాంత్, సెక్రటరీలుగా శేషయ్య, కుమార్, ఉపాధ్యక్షురాలు ఉమాదేవి, జనరల్ సెక్రెటరీగా పద్మ, మెట్టుగూడ డివిజన్ ప్రెసిడెంట్‌గా శివకుమార్, సీతాఫల్‌మండి ప్రెసిడెంట్‌గా ప్రదీప్‌కుమార్, అడ్డగుట్ట డివిజన్ సెక్రటరీగా మోహన్‌లను ఎన్నుకున్నారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య చేతుల మీదుగా వీరికి నియామకపత్రాలను అందజేశారు. అంబేడ్కర్ ఆలోచన విధానంతో ముందుకు సాగుతూ ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. అదే విధంగా స్వర్గీయ పీ.వీ. రావు అడుగుజాడల్లో నడుస్తూ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డి. కోటేశ్వరరావు, రామ్‌చందర్, సాయినాథ్, బ్రహ్మయ్య, చెక్క నరసింహ, నారాయణ, పుష్ప, లక్ష్మి, భారతమ్మ, బాబు రావు తదితరులు పాల్గొన్నారు.

కంజర్ల రమేశ్‌యాదవ్‌కు ఎమ్మెల్యే నివాళి



సనత్‌నగర్: ప్రముఖ వ్యాపారవేత్త కంజర్ల రమేశ్ యాదవ్ (57)కు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ నివాళులర్పించారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న కంజర్ల రమేశ్ ఒక ప్రైవేట్ హాస్పటల్‌లో చేర్పించగా, చికిత్స పొందుతూ మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం జెక్‌కాలనీలోని వారి నివాసానికి వెళ్లి రమేశ్ పార్థీవ దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, నాయకులు సురేష్‌గౌడ్, ఖలీల్, ఫాజిల్, సమీవుల్లా, జమీర్ తదితరులు ఉన్నారు.

ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదు: ఏసీపీ యాదగిరి



మాట్లాడుతున్న ఏసీపీ యాదగిరి

బన్సీలాల్‌పేట్: పండుగలు, ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని గాంధీనగర్ డివిజన్ ఏసీపీ యాదగిరి అన్నారు. గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోయిగూడ ముదిరాజ్ భవన్‌లో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న గణేశ్ ఉత్సవాలను శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జరుపుకోవాలన్నారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్, దోమలగూడ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, లేక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చిట్టి, నిర్వాహకులు, పీస్ కమిటీ ప్రతినిధులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు మౌనికా, నర్సింహ, హరీశ్, శ్రీనివాస్‌రెడ్డి, గాంధీనగర్, దోమలగూడ, లేక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని గణేశ్ మండపాల నిర్వాహకులు, పీస్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

తార్నాక చౌరస్తాలో రోడ్డుపై గుంతల పూడ్చివేత

సాక్షి ఎఫెక్ట్

లాలాపేట: కొన్ని రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు తార్నాకలో డివిజన్‌లో రోడ్లు అధ్వానంగా మారాయి. తార్నాక చౌరస్తా ప్రధాన రహదారిలో ఏర్పడిన అడుగు మేర లోతైన గుంతలతో ద్విచక్ర వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. అనే సమస్యపై అధ్వానంగా రోడ్లు అనే శీర్షికతో సోమవారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. తార్నాక మున్సిపల్ డివిజన్ ఏఈ వేణు ఆధ్వర్యంలో తార్నాక చౌరస్తా ప్రధాన రహదారిలో దాదాపు అడుగు లోతు మేర ఏర్పడిన గుంతలను పూడ్చివేశారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయడంతో ద్విచక్ర వాహనదారుల హర్షం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షి దిన పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

